**వేటగాళ్ల నుంచి రక్షకులుగా మారుస్తున్న అటవీ శాఖ**


3లో

# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరకాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు**


3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 285 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 09 అక్టోబర్ 2026



# పేదల ఓట్లు తొలగించే కుట్ర

● ఓటు హక్కు హరణకు బీజేపీ పార్టీ పన్నాగం ● సైమన్ కమిషన్‌లా ఉపయోగించే ప్లాన్ ● మోదీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు ● సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి ● గల్లీ నుంచి ఢిల్లీ వరకూ పోరాటం తప్పదు ● ఢిల్లీ ఇండియా కూటమి నిరసనలో రేవంత్

**న్యూఢిల్లీ,అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని

మిగతా2లో...

## జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు ఉండాలి

- తెలంగాణ ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలి: భట్టి విక్రమార్క



**న్యూఢిల్లీ,అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూనే రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క కేంద్రాన్ని కోరారు. 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు.నిజాయితీగా పన్నులు

మిగతా2లో...

# మారుమూల పల్లెలకూ బ్యాంకులు, ఆసుపత్రులు

● టెలికాం రంగంలో సరికొత్త విప్లవం తెచ్చాం ● 'డిజిటల్ ఇండియా'తో టెక్నాలజీ అందుబాటులోకి ● ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు ● ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రసంగించిన మోదీ




**న్యూఢిల్లీ,అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):**దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరుగుతున్న 10వ ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ భారత టెలికాం, డిజిటల్ రంగాల ప్రగతిని సమగ్రంగా వివరించారు. కరోనా సంక్షోభ సమయంలోనూ వెనకడుగు వేయకుండా టెలికాం సేవలను గ్రామీణ ప్రాంతాల వరకు బలంగా తీసుకెళ్లామని చెప్పారు. డిజిటల్ కనెక్టివిటీ ఆధారంగానే పల్లెల్లో ఉండే ప్రజల ముంగిటకు బ్యాంకింగ్, వైద్యం సహా కీలకమైన ప్రభుత్వ సేవలను చేర్చడం సాధ్యమైందని స్పష్టం చేశారు. విప్లవాత్మక టెలికాం సంస్కరణల ద్వారా దేశంలో పారదర్శక పాలనను మరింత బలోపేతం చేశామని, పేదలకు అందాల్సిన సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టకుండా కాపాడగలిగామని తెలిపారు. వ్యవస్థల్లో తీసుకొచ్చిన ఈ మార్పులను ఎవరు వ్యతిరేకించినా సంస్కరణల ప్రయాణం ఆగబోదని స్పష్టం

మిగతా2లో...


2లో

## ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. రైతులను అణిచివేసే ప్రభుత్వం

- రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు: హరీశ్‌రావు

# వ్యాపారులకు భారీ ఊరట..

● పన్ను అధికారులకు అరెస్ట్ అధికారం రద్దు ● ప్రాసిక్యూషన్ పరిమితి రూ. 5 కోట్లకు పెంపు ● ఇ-కామర్స్ వ్యాపారులకు జరిమానా తగ్గింపు ● ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పై అధ్యయనానికి కమిటీ ● జీఎస్టీ నిభంధనల్లో సంచలన మార్పులు ● జీఎస్టీ రేట్లలో ఊరట.. ఈసారి లేని మార్పులు ● 57వ జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు!




**న్యూఢిల్లీ,అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** జీఎస్టీ కౌన్సిల్ గురువారం (అక్టోబర్ 08) ఢిల్లీలోని భారత్ మండపంలో ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించింది. ఈ కౌన్సిల్ ఒక కీలకమైన, చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, జీఎస్టీ కింద ఎటువంటి అరెస్టులు జరగవు. జీఎస్టీ కింద అరెస్టు చేసే అధికారాన్ని కౌన్సిల్ పూర్తిగా తొలగించింది. అలాగే, ప్రాసిక్యూషన్ పరిమితిని రూ. 1 కోటి నుండి రూ. 5 కోట్లకు పెంచింది. జీఎస్టీ విధానంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. ఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను చెల్లింపుదారులకు సంబంధించిన అమలు,

మిగతా2లో...

# 'బిల్డ్ ఏపీ' మా నినాదం

- ఒప్పందాలను వాస్తవ పెట్టుబడులుగా మారుస్తాం
- 22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగాం
- దిగ్గజ సంస్థలు ఏపీలో కార్యకలాపాలకు ముందుకు
- పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో అనుమతులు
- వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం
- సీఐఐ భాగస్వామ్య సదస్సులో సిఎం చంద్రబాబు




**న్యూఢిల్లీ,అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** 'బిల్డ్ ఏపీ' నినాదంతో ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో దేశంలోనే అగ్రగామి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఢిల్లీ వేదికగా జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు,

మిగతా2లో...


2లో

## కాంగ్రెస్ చలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తం

## నటనా దిగ్గజం నానా పటేకర్ కన్నుమూత


2లో

# సీఈసీ రాజీనామా చేయాల్సిందే

● మోదీ, షాకు సద్బుద్ధి కలగాలి ● రాజ్‌ఘాట్ వద్ద ఇండీ నేతల ప్రార్థనలు



**న్యూఢిల్లీ,అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీ ఆశీస్సులతో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ ఎంపీలు స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన ఆగదని తేల్చి చెప్పారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో కలిసి దాదాపు 300 మంది ఉభయ సభల ఎంపీలు బస్సులో రాజ్ ఘాట్?కు వెళ్లారు. జాతిపిత మహాత్మా గాంధీ స్మారకం వద్ద ఒక్కొక్కరుగా నివాళు లర్పించారు. దిల్లీలో శుక్రవారం

మిగతా2లో...

# పేదల ఓట్లు తొలగించే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది.

ఇప్పుడు ఓటమి ఖాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. రైతులను అణిచివేసే ప్రభుత్వం

**హైదరాబాద్:అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం కాదని, రైతులను అణిచివేసే విధంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.**రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏది?**రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హరీశ్‌రావు అన్నారు. రైతు భరోసా నిధులు, పంటల కొనుగోళ్లు, పంట బోనస్ వంటి అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.**పంటల కొనుగోలుపై విమర్శలు**కేంద్రం నిర్దేశించిన పరిమితుల మేరకే పంటలు కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వ వైఖరి రైతులకు ఇబ్బందులు కలిగిస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇలాంటి నిర్ణయా లతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.**రైతుల సమస్యలు పరిష్కరించాలి**రైతులకు అండగా నిలిచి వారి సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా పంటల కొనుగోళ్లు, సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# నటనా దిగ్గజం నానా పటేకర్ కన్నుమూత



**ముంబై,అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ బాలీవుడ్, మరాఠీ నటుడు నానా పటేకర్ (75) కన్నుమూశారు. గోవాలోని తన నివాసంలో గురువారం తెల్లవారుజామున గుండెపోటుకు గురయ్యారు. వైద్యులు సుమారు 45 నిమిషాల పాటు ప్రయత్నించినప్పటికీ ఆయనను కాపాడలేకపోయారు. 1978లో సినీ రంగంలోకి అడుగుపెట్టిన నానా పటేకర్ 'సలామ్ బాంబే', 'పరిందా', 'క్రాంతివీర్', 'అగ్ని సాక్షి', 'అబ్ తక్ ఛప్పన్', 'వెల్‌కమ్' వంటి చిత్రాలతో గుర్తింపు పొందారు. మూడు జాతీయ చలనచిత్ర పురస్కారాలు అందుకున్నారు. కళారంగానికి చేసిన సేవలకు 2013లో పద్మశ్రీ పురస్కారం వరించింది. నటుడిగానే కాకుండా రైతుల సంక్షేమం కోసం 'నామ్ ఫౌండేషన్' ద్వారా సేవలందించారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ చలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తం

- సీఈసీ రాజీనామాకు డిమాండ్ చేస్తూ నిరసన
- భారీ ప్రదర్శనగా ఇండీ కూటమి ప్రతినిధులు ర్యాలీ
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు అరెస్ట్

**హైదారాబాద్,అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లో ఓటర్ల సవరణ ప్రక్రియలో భారీగా అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చిన చలో లోక్ భవన్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టాయి. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ లోక్ భవన్ వైపు దూసుకెళ్లింది. వందలాది మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు లోక్ భవన్‌ను ముట్టడించేందుకు యత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో నిరసన తెలుపుతున్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి మరియు కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్‌లను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టుల అనంతరం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు నెలకొన్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన ఓటు హక్కును కాపాడటంలో సిఇసి విఫలమయ్యారని ఆరోపించారు. పారదర్శకమైన రీతిలో ఎన్నికల వ్యవస్థ సాగాలంటే సిఇసి జ్ఞానేశ్వర్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపీలను కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేయించడాన్ని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ చర్యలు ముమ్మాటికీ అక్రమమని, అప్రజాస్వామికమని పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టి పారదర్శకమైన ప్రక్రియను చేపట్టే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ కాంగ్రెస్ స్పష్టం చేసింది.

# వ్యాపారులకు భారీ ఊరట..

(మొదటి పేజీ తరువాయి)

ప్రాసిక్యూషన్ నిబంధనలపై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా జీఎస్టీ అధికారులకు ఉన్న అరెస్ట్ అధికారాలను తొలగిస్తూ.. కౌన్సిల్ నిర్ణయించింది. దీంతో జీఎస్టీ ఉల్లంఘనలకు సంబంధించి పన్ను అధికారులు నేరుగా అరెస్ట్ చేసే అవకాశం ఇక ఉండదు. ఇప్పటివరకు తీవ్రమైన పన్ను ఎగవేత, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వంటి కొన్ని కేసుల్లో జీఎస్టీ అధికారులు అరెస్ట్ చేసే అధికారం ఉంది. ఈ అధికారాన్ని పరిమితం చేయడం ద్వారా సాధారణ పన్ను వివాదాలు, వ్యాపార సంబంధిత పొరపాట్లు క్రిమినల్ చర్యల స్థాయికి వెళ్లకుండా చూడాలనే ఉద్దేశంతో సంస్కరణలు తీసుకొచ్చింది కేంద్రం. పన్ను బకాయిల వసూలు, వడ్డీ, జరిమానాల విధింపు వంటి ఇతర చర్యలు మాత్రం కొనసాగుతాయి. అదే సమయంలో జీఎస్టీ కింద ప్రాసిక్యూషన్ ప్రారంభించే పరిమితిని కూడా భారీగా పెంచారు. ఇప్పటివరకు రూ.1 కోటి పన్ను ఎగవేతకు సంబంధించిన కేసుల్లో ప్రాసిక్యూషన్ ప్రారంభించే అవకాశం ఉండగా.. ఇకపై ఆ పరిమితిని రూ.5 కోట్లకు పెంచారు. అంటే రూ.5 కోట్లకు లోబడిన పన్ను ఎగవేత కేసుల్లో క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు వెళ్లే అవకాశం తగ్గనుంది. ఈ మార్పులను పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేయడం, వ్యాపార సంస్థలపై అనవసరమైన చట్టపరమైన ఒత్తిడిని తగ్గించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మెరుగుపరచడం వంటి లక్ష్యాలతో కొత్త సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. జీఎస్టీ 2.0లో భాగంగా కేవలం అరెస్ట్, ప్రాసిక్యూషన్ నిబంధనలే కాకుండా.. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వ్యవస్థలో మార్పులు, రిఫండ్లను వేగవంతం చేయడం, వివాదాలను తగ్గించడం వంటి పలు అంశాలపై కూడా కౌన్సిల్ దృష్టి సారించింది. మొత్తంగా చూస్తే, జీఎస్టీ అమలులో కఠినమైన క్రిమినల్ చర్యల కంటే పన్ను వసూళ్లు, అనుసరణ, సులభమైన వ్యాపార విధానాలకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా తాజా నిర్ణయాలు ఉన్నాయని చెప్పొచ్చు. అయితే ఈ మార్పులు పూర్తిగా అమల్లోకి రావడానికి అవసరమైన చట్టపరమైన సవరణలు, తదుపరి ప్రక్రియ కూడా కీలకం కానున్నాయి.

# 'బిల్డ్ ఏపీ' మా నినాదం

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్ కార్యాచరణను పారిశ్రామికవేత్తలకు వివరించా రు. గత 28 నెలల్లో రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని చంద్రబాబు తెలిపారు. కేవలం అవగాహన ఒప్పందాల (ఎంవోయూ)కే పరిమితం కాకుండా, వాటిని వాస్తవ పెట్టుబడులుగా మార్చేందుకు పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వస్తున్నాయని వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఎస్క్రో ఖాతాను నవంబరు 12, 13 తేదీల్లో ప్రారంభిస్తామని ప్రకటించారు. పెట్టుబడులకు అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేశామని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పరిశ్రమలకు అన్ని అనుమతులు వేగంగా అందిస్తున్నామని తెలిపారు. నదుల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నీటి కొరత తీర్చవచ్చని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా, రాష్ట్రాన్ని సౌత్‌ఈస్ట్ ఏషియాకు గేట్‌వేగా మార్చడమే ధ్యేయమన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 110 గిగావాట్లకు ఒప్పందాలు కుదిరాయని, ప్రత్యేక ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. దుగరాజపట్నం, మచిలీపట్నంలో షిప్ బిల్డింగ్ కేంద్రాలు, తిరుపతి, కొప్పర్తిలలో ఎలక్ట్రానిక్స్, డ్రోన్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పాలనలో ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నామని, అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారం అభినందనీయమని, పోలవరం, అమరావతి నిర్మాణానికి అండగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, భారత అభివృద్ధి ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్‌ది చారిత్రక పాత్ర అని కొనియాడారు. శాతవాహనుల కాలం నుంచే ఆంధ్ర ప్రాంతం నౌకా వాణిజ్యానికి ప్రసిద్ధి అని గుర్తుచేశారు. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు "టీమ్ ఇండియా"గా కలిసి పనిచేస్తున్నాయని, కేంద్రం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఏపీ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని అన్నారు. 'ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాస్, ఆత్మరక్ష' అనే విధానాలతో దేశం ముందుకు సాగుతోందని, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షుడు ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల పల్లెలకూ బ్యాంకులు, ఆసుపత్రులు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు.దేశంలో టెలికాం మౌలిక వసతులు ఊహించని రీతిలో విస్తరించాయని మోదీ వెల్లడించారు. దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ నెట్‌వర్క్ చేరుకుందని, ప్రస్తుతం 5.5 లక్షలకు పైగా 5జీ బేస్ స్టేషన్లు నిరంతరం సేవలందిస్తున్నాయని తెలిపారు. 2022 నాటి పరిస్థితులతో పోలిస్తే దేశంలో మొబైల్ ఇంటర్నెట్ వేగం ఏకంగా పది రెట్లు పెరగడం గర్వకారణమని చెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఇన్వెస్ట్', 'ఇన్నోవేట్' నినాదాలతో మొబైల్స్, టెలికాం పరికరాల తయారీలో భారత్ ప్రపంచ కేంద్రంగా అవతరిస్తోందని కొనియాడారు. డిజిటల్ సేవలు పెరుగుతున్న కొద్దీ ఫోన్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ భద్రతను పటిష్ఠం చేయడం అత్యవసరమని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం డీప్‌ఫేక్స్, సైబర్ మోసాలు సమాజానికి అతిపెద్ద సవాలుగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, టెక్ సంస్థలు, ఆర్థిక రంగాలు కలిసి డీప్‌ఫేక్స్‌ను అడ్డుకునేందుకు ఒక గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల వద్దకు మోసపూరిత సమాచారం చేరకముందే సాంకేతిక సాయంతో అడ్డుకునేందుకు అంతర్జాతీయ టెలికాం ఆపరేటర్లు, జీఎస్ఎంఏ సమష్టిగా పనిచేయాలని సూచించారు.భుత్వ అధినేతగా 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సమయంలో ఐఎంసీ 10వ వార్షికోత్సవం జరుపుకోవడం ఎంతో ప్రత్యేకమని మోదీ చెప్పారు. ఈ ఏడాది జీఎస్ఎంఏ బోర్డు సమావేశానికి భారత్ వేదికగా నిలవడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ప్రపంచవ్యాప్తంగా వచ్చిన టెలికాం నిపుణులకు స్వాగతం పలికారు.

# సీఈసీ రాజీనామా చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్టు తెలిపారు. అంతకుముందు మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఓట్ల దొంగతనం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, యువత సమస్యలన్నీ ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని చెప్పారు. జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ, వల్లభ్ భాయ్ పటేల్ వంటి మహానాయకులు సాధించి పెట్టిన స్వేచ్ఛను, ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం లాక్కుంటోందని ఆరోపించారు. లోక్?సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమను రెండు రోజులుగా నిరసన తెలపకుండా అడ్డుకున్నారని, మొదటి రోజు ఎన్నికల సంఘం వద్ద, బుధవారం జంతర్ మంతర్ వద్ద అడ్డుకుని దాడులు చేశారని ఆరోపిం చారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్ షా, జ్ఞానేష్ కుమార్, మోహన్ భగవత్ లు నేరపూరిత కుట్ర ద్వారా రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఓట్లను దొంగిలించి దేశాన్ని హైజాక్ చేశారని, త్వరలోనే ఆ నలుగురిని చట్టం ముందుకు తెస్తామన్నారు. ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్నారు. అందుకోసం అపాయిం ట్‌మెంట్ తీసుకున్నారు. ఆ సమయంలో ఎన్నికల సంఘంపై వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వినతి పత్రం సమర్పించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు బంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఇప్పటికే దిల్లీకి చేరుకున్నారు. ఇదిలా ఉండగా, సీఈసీకి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన ఇండీ కూటమి ఎంపీలు పట్ల దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ గురువారం భోపాల్‌లో ఆందోళన నిర్వహించింది. వ్యాపమ్ స్క్వేర్ నుంచి బోర్డ్ ఆఫీస్ స్క్వేర్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్, ప్రధానమంత్రి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "ఓటును కాపాడండి, దేశాన్ని కాపాడండి" అనే నినాదంతో భోపాల్ నగర జిల్లా కాంగ్రెస్ కమిటీ నిర్వహించిన ఈ నిరసనలో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సహా పలువురు పాల్గొన్నారు. ఓటు హక్కును కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతామని తెలిపారు.

# జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించే వారికి విధానాలను సరళీకరించడంతో పాటు, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడేవారిపై కఠిన చర్యలు కొనసాగించాలని భట్టి అన్నారు. జీఎస్టీ అమలులో కేంద్రం, రాష్ట్రాలు భాగస్వాములుగా పనిచేస్తూ రాష్ట్రాల ఆదాయాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ సొంత పన్ను ఆదాయంలో జీఎస్టీ వాటా సుమారు 35 శాతం ఉందని, ఆదాయంలో తగ్గుదల రాష్ట్రంలో పాఠశాలలు, ఆసుపత్రులు, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. మోటార్ వాహనాలు తదితర రంగాల్లో ప్రతిపాదిత మార్పుల వల్ల తెలంగాణకు ఏటా సుమారు రూ.800 కోట్ల ఆదాయ ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు.నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లు, నకిలీ ఇన్‌వాయిస్‌లు, గుర్తింపు వివరాల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని భట్టి కోరారు. అలాగే హైదరాబాద్‌లో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, కీలక కమిటీల్లో తెలంగాణకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం అంతిమంగా ప్రజలకు చెందుతుందని, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు.

# 'సీతారామ' సత్తుపల్లి ట్రంక్ పనులను వేగవంతం చేయాలి



**సత్తుపల్లి:అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలను తీర్చే లక్ష్యంతో చేపట్టిన 'సీతారామ' ఎత్తిపోతల పథకం, సత్తుపల్లి ట్రంక్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయి ప్రాజెక్టు పురోగతి, పెండింగ్ పనులు, భూసేకరణ, పైప్‌లైన్ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు.**రైతులకు వెంటనే పరిహారం** పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని తుమ్మల కోరారు. సత్తుపల్లి ట్రంక్ పనులు పూర్తయితే సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయని తెలిపారు.**ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా** వర్షాభావ పరిస్థితుల్లో ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా కల్పించడంలో సీతారామ ప్రాజెక్టు కీలకంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి నీటిని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.**పెండింగ్ పనులపై అధికారులకు ఆదేశాలు** మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. భూసేకరణ, పైప్‌లైన్, ఇతర పనుల పురోగతిని సమీక్షించి, రైతులకు త్వరగా సాగునీరు అందేలా పెండింగ్ పనులను వేగవంతం చేయడంతో పాటు భూసేకరణ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు ఇస్తామని తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరకాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు








**పరకాల, అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరకాలలో మహిళా సాధికారత విభాగం మరియు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ప్రకృతిలో లభించే తంగేడు, బంతి, గునుగు, సీతజడ, మందార, గుమ్మడి వంటి తీరొక్క పూలతో స్వయంగా బతుకమ్మలను తయారు చేసి అందంగా అలంకరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మలను సంప్రదాయ బద్ధంగా పేర్చి, పాటలు పాడుతూ వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బేతి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను ఎంతో అందంగా అలంకరించడం అభినందనీయమన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థినీలు బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ కార్యక్రమంలో మరింత ఉత్సాహాన్ని నింపారు. కళాశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం అధిపతి డాక్టర్ టి. కల్పన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఏ. శ్రీనివాస్ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# 'మీ ప్రమాణం' యాప్‌తో ఉద్యోగుల హాజరు నమోదు చేయాలి

• జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జి.




**ములుగు, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ ఉద్యోగుల సమయపాలన, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ప్రవేశపెట్టిన 'మీ ప్రమాణం' యాప్ ద్వారా అధికారులు, సిబ్బంది హాజరు నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్. మహేందర్ జి. సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల నోడల్ అధికారులు, ఉద్యోగులకు యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ముఖగుర్తింపు, కార్యాలయ స్థాన నిర్ధారణ ద్వారా హాజరు నమోదు చేసే విధానాన్ని అధికారులు వివరించారు. రెగ్యులర్, కాంట్రాక్టు, పొరుగు సేవల ఉద్యోగుల వివరాలను నోడల్ అధికారులు త్వరితగతిన నమోదు చేయాలని మహేందర్ జి. ఆదేశించారు. కార్యాలయానికి వచ్చినప్పుడు, విధులు ముగించుకుని వెళ్లేటప్పుడు నిర్దేశిత విధానం ప్రకారం హాజరు నమోదు చేయాలని సూచించారు. ఉద్యోగులు కార్యాలయ వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలను సకాలంలో అందించాలని తెలిపారు. ఉద్యోగుల వివరాల నమోదులో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సాంకేతిక సమస్యలు తలెత్తితే సంబంధిత నోడల్ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఐటీడీఏ ఎస్డీసీ ప్రతాప్, యాప్ నోడల్ అధికారి దేవేందర్, సాంకేతిక బృందం ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# వేటగాళ్ల నుంచి రక్షకులుగా మారుస్తున్న అటవీ శాఖ

### అటవీవన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

### ఏటూరునాగారం ఎఫ్ఆర్ఓ రెహమాన్







**ఏటూరునాగారం, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా కలిసి పనిచేయాలని ఏటూరునాగారం ఎఫ్ఆర్ఓ రెహమాన్ పిలుపునిచ్చారు. అడవులను, వన్యప్రాణులను కాపాడితేనే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించగలమన్నారు. ములుగు జిల్లాలో విస్తారమైన అటవీ ప్రాంతం ఉందని, ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో అడవులు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అక్రమ ఆక్రమణలను గుర్తించి సుమారు 20,050 హెక్టార్ల అటవీ భూమిని తిరిగి శాఖ ఆధీనంలోకి తీసుకునే చర్యలు చేపట్టినట్లు వివరించారు. మరో 650 హెక్టార్లలో అటవీకరణకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. వన్యప్రాణుల వేటను అరికట్టేందుకు స్థానికులకు అవగాహన కల్పిస్తున్నామని, వేటగాళ్లను రక్షకులుగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని రెహమాన్ తెలిపారు. వేట పరికరాల వినియోగం గతంతో పోలిస్తే తగ్గిందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు వన్యప్రాణులకు నీరు, ఆహారం అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వన్యప్రాణులు రహదారులు దాటే ప్రాంతాల్లో వాహన ప్రమాదాలను నివారించేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అడవులు, పక్షులు, వన్యప్రాణులు, ఔషధ మొక్కలు, సహజ వనరులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. "అడవిని ముక్కలు కాకుండా కాపాడేందుకు ప్రజల సహకారం అవసరం. సమాజం ముందుకొస్తే అటవీశాఖ కూడా ముందుండి పనిచేస్తుంది. అందరం కలిసి అడవులను పూర్తిస్థాయిలో రక్షించుకుందాం" అని రెహమాన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలను పరిష్కరిస్తాం..: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**సత్తుపల్లి, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** భూ సమస్యల పరిష్కారానికి పాత రెవెన్యూ రికార్డులు, ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి నిజమైన హక్కుదారులకు న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని నారాయణపురంలో భూ రీ-సర్వే, సీలింగ్ భూముల సమస్యలపై నిర్వహించిన గ్రామ సభలో రైతుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. నారాయణపురంలో భూముల వాస్తవ పరిస్థితి, సాగులో ఉన్న విస్తీర్ణం తదితర వివరాలను రీ-సర్వే ద్వారా గుర్తించినట్లు తెలిపారు. పాత పహాణీలు, సీలింగ్ భూముల రికార్డులు, పట్టాలు, భూ బదలాయింపులు, సాదాబైనామాలు తదితర వివరాలను పరిశీలించి రికార్డుల్లో ఉన్న వ్యత్యాసాలను పరిష్కరిస్తామని చెప్పారు. భూ రీ-సర్వేకు సంబంధించి రైతుల అభ్యంతరాలు, సందేహాలపై అక్టోబర్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులు తమ వద్ద ఉన్న పాత పత్రాలు, కొనుగోలు, వారసత్వం, భూ బదలాయింపులకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని సూచించారు. అందుబాటులో ఉన్న రికార్డులు, ఆధారాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి పారదర్శకంగా నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, మండల ప్రత్యేక అధికారి ముజాహిద్, సత్తుపల్లి తహసీల్దారు సత్యనారాయణ, గ్రామ సర్పంచులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

### ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెన్షన్, 250 గజాల ఇంటి స్థలం కల్పించాలి



**హనుమకొండ, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి సత్వర న్యాయం చేయాలని కోరుతూ.. గురువారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన ఆరోగ్య భరోసా హామీల్లో భాగంగా ఉద్యమకారులకు పెన్షన్‌తో పాటు 250 గజాల ఇంటి స్థలం కల్పిస్తామని హామీ ఇచ్చిందని వారు గుర్తు చేశారు. ఈ హామీ అమలులో భాగంగా ప్రభుత్వం నియమించిన కె.కె. కమిటీ ద్వారా ఉద్యమకారుల గుర్తింపు, ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. పరకాల నియోజకవర్గ పరిధిలోని ఉద్యమకారుల వివరాలను సేకరించి, అర్హులను గుర్తించే ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలు, పోరాటాలను గుర్తించి వారికి ప్రభుత్వ పరంగా తగిన గౌరవం, సంక్షేమ ప్రయోజనాలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. గుర్తింపు ప్రక్రియలో అనవసర జాప్యం వల్ల ఉద్యమకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. అర్హులైన ఉద్యమకారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టి, పెన్షన్, ఇంటి స్థలం వంటి హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(యూఎస్ఐ) పార్టీ రాష్ట్ర నాయకులు (డీబీఎస్‌వీ) గడ్డం చరత్, పరకాల డివిజన్ కార్యదర్శి శేనిగరపు బిక్షపతి, బహుజన సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకులు ఈర్ల సాంబన్న, ఈర్ల రాజు, ఈర్ల రమేష్, శనిగరపు కుమార్, బొల్లె శ్యాం, శనిగరపు రజనీకాంత్, శనిగరపు సంపత్, పోడేటి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఖమ్మం బాలికల వాలీబాల్ జట్టు




**కల్లూరు, అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పాఠశాలల క్రీడల సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జూనియర్ కళాశాలల విభాగం ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలికల వాలీబాల్ జట్టుకు కల్లూరు గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంలో నిర్వహించిన శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఆదివారం నుంచి కొనసాగిన శిక్షణలో 15 మంది బాలికలు పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలు మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవిబాబు, డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మూసా ఖయ్యూం, శిక్షణ శిబిరం ఇన్‌చార్జి పసుపులేటి వీర రాఘవయ్య, తల్లపురెడ్డి గౌతమ్‌రెడ్డి, బోడ భీమా తదితరులు క్రీడాకారులకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించారు. కల్లూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు క్రీడాకారులకు భోజన వసతులు కల్పించారు. సీనియర్ కోకో క్రీడాకారుడు కోటికలపూడి ప్రభాకర్‌రావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు రాము, కళ్యాణ్ కిషోర్ రూ. 10 వేల విలువైన క్రీడా దుస్తులను క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా కల్లూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు, స్పోర్ట్స్ అడ్వైజర్ అబ్దుల్ రహీం జట్టు సభ్యులను అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.



# సౌత్ ఇండియా ఎడ్యుకేటర్స్ సమ్మిట్‌లో డాక్టర్ వెంకటేశ్వరరావుకు పురస్కారం

• 'డైనమిక్ ప్రిన్సిపాల్ అవార్డు2026' అందుకున్న బిర్లా విద్యా సంస్థల చైర్మన్

**హనుమకొండ, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** విద్యా రంగంలో విశిష్ట నాయకత్వానికి వరంగల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ లయన్ డాక్టర్ నడిపల్లి వెంకటేశ్వరరావుకు 'డైనమిక్ ప్రిన్సిపాల్ అవార్డు2026' లభించింది. హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహించిన సౌత్ ఇండియా ఎడ్యుకేటర్స్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. విద్యార్థుల్లో ప్రతిభ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా విద్యా సంస్థను ముందుకు నడిపిస్తున్నందుకు ఈ గౌరవం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎడ్యుకేషన్ న్యూస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో అందించిన ఈ పురస్కారం పట్ల పలువురు విద్యావేత్తలు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అవార్డు వెనుక ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యం, శ్రేయోభిలాషుల సమష్టి కృషి ఉందన్నారు. విద్య, విలువలు, సృజనాత్మకతకు సమన్వయ వేదికగా పాఠశాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.



# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన



**కల్లూరు, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటు నమోదు ప్రక్రియపై కల్లూరులోని పలు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులకు బీఆర్ఎస్ నాయకులు అవగాహన కల్పించారు. మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య ఆదేశాల మేరకు కౌన్సిలర్లు పెడకంటి రామకృష్ణ, లక్కినేని రఘు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 2023లోపు పట్టభద్రులైన వారు ఓటు నమోదుకు అర్హులని, గతంలో ఓటు ఉన్న వారు కూడా తిరిగి నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదుకు నవంబర్ 6 వరకు గడువు ఉందని తెలిపారు. ప్రతిభ స్కూల్ అండ్ కాలేజీ, బాలాజీ హైస్కూల్, సెంచరీ స్కూల్, లెమర్ స్కూల్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, నవ్యజ్యోతి జూనియర్ కాలేజీ, తెలంగాణ గ్రామర్ స్కూల్ యాజమాన్యాలు, ఉపాధ్యాయులను కలిసి వివరాలు తెలియజేశారు. బీఆర్ఎస్ తరఫున ఏజెంట్ ద్వారా ఓటు నమోదు చేయనున్నందున అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎం.డి. ఇస్మాయిల్, మేకల కృష్ణ, ఉబ్బన వెంకటరత్నం, సయ్యద్ రౌఫ్, కొరకొప్పు ప్రసాద్, షేక్ కమిలి, కొత్తపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్, ప్రియాంకపై పోలీసుల చర్యలకు నిరసనగా కోమటిరెడ్డి నిరాహారదీక్ష

### - ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుంది




**కరీంనగర్, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై పోలీసుల చర్యలకు నిరసనగా, ఓటు హక్కు పరిరక్షణ కోసం సూడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఒక్కరోజు నిరాహారదీక్ష చేపట్టారు. కరీంనగర్ ముకరంపురలోని తన కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని అన్నారు. ఓటరు జాబితా, ఎన్నికల ప్రక్రియపై వస్తున్న అభ్యంతరాలపై సమగ్రంగా పరిశీలన జరిపి అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే ఆమరణ నిరాహారదీక్షకు కూడా సిద్ధమని తెలిపారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో ఉన్న అనుమానాలను ఎన్నికల సంఘం నివృత్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ తాజ్, కార్పొరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలి

### - ఎండిపోతున్న పంటలను కాపాడాలి: గుంజపడుగు హరిప్రసాద్



**చొప్పదండి, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** రైతులకు నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్ అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలం దత్తోజిపేటలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ఎండిపోతున్న వరి పంటలను ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పంటలకు సకాలంలో సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. ఎండిపోయిన పంటలతో నష్టపోయిన రైతులను వెంటనే గుర్తించి పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మ్యాకల తిరుపతి, మ్యాక వినోద్, శ్రీరాముల రమేష్, చంటి శ్రీనివాస్, పుల్ల మల్లేశం, కరీంనగర్ నగర పార్టీ అధ్యక్షురాలు రంగరవేణి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రఘునాథగూడెంలో రీసర్వే పనులపై సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ క్షేత్రస్థాయి పరిశీలన



**కల్లూరు, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** కల్లూరు మండలం రఘునాథగూడెం గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూ కొలతలు, సర్వే రికార్డుల పరిశీలన, సరిహద్దుల నిర్ధారణ తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రైతులతో ముఖాముఖిగా మాట్లాడి రీసర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలు, సమస్యలు, సందేహాలను తెలుసుకున్నారు. భూ వివరాల నమోదు పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి వచ్చిన సమస్యలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రీసర్వే పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు.

# ఉద్యమకారులు ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలి

- చట్టసభల్లో తెలంగాణ ఉద్యమకారుల గొంతుక వినిపించాలి
- ఎమ్మెల్సీ స్థానాలు ఉద్యమకారులకు కేటాయించాలి




**ఉప్పల్, అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** డిగ్రీ అర్హత కలిగిన ప్రతి తెలంగాణ ఉద్యమకారుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డా. చీమ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఉద్యమకారుల గొంతుక శాసనమండలిలో వినిపించాలంటే కుటుంబ సభ్యులు కూడా అర్హత మేరకు ఓటర్లుగా నమోదు కావాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల త్యాగాలు కీలకమని, అయినా రాజకీయ పార్టీలు వారిని విస్మరిస్తున్నాయని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల్లోని ఉద్యమకారులు పార్టీలకు అతీతంగా ఐక్యమై హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. వార్డు సభ్యుడి నుంచి పార్లమెంటు వరకు ఉద్యమకారులకు 20 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎర్రవల్లిలో అమరవీరుల కాలనీ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగన్ యాదవ్, జోగు అంజయ్య, దుగ్గని శ్యామల, ఆర్.కె. భూపాల్, మంజూష, భాను ప్రకాష్ రెడ్డి, శ్యామల చంద్రశేఖర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన కరీంనగర్ లయన్స్ క్లబ్






**కరీంనగర్, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** నిరుపేదలు, అణగారిన వర్గాలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఛారిటబుల్ కంటి ఆసుపత్రిలో ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది చింతల ప్రభాకర్, రాజు మాట్లాడుతూ కంటి సమస్యలను తొలిదశలోనే గుర్తించేందుకు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సకాలంలో చికిత్స పొందడం ద్వారా దృష్టి లోపాలను నివారించవచ్చని తెలిపారు. ఆసుపత్రి కరీంనగర్ లయన్స్ క్లబ్‌కు శాశ్వత సేవా ప్రాజెక్టుగా కొనసాగుతోందని, ఏడాది పొడవునా నిరుపేదలు, అర్హులకు కంటి పరీక్షలు, చికిత్సతో పాటు ఉచిత కంటి సంరక్షణ సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మైదం శివకాంత్ పటేల్, కార్యదర్శి బట్టు వినోద్ పటేల్, కోశాధికారి మేతుకు కె. చైతన్య, ఆసుపత్రి ఛైర్మన్ ప్రకాశ్ హోల్లా, కోల అన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజల్లో కంటి ఆరోగ్యంపై మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు.

# శరన్నవరాత్రి మహోత్సవాలకు ముస్తాబైన నగునూరు దుర్గా భవాని ఆలయం

### ప్రకాశం గంజ్ నుంచి నగునూరు వరకు ఘనంగా శోభాయాత్ర

### అమ్మవారికి 8 కిలోల బంగారు ఆభరణాలు.. భక్తుల భాగస్వామ్యానికి పిలుపు







**కరీంనగర్, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ శివారులోని నగునూరు శ్రీ పరివార సమేత శ్రీ దుర్గా భవాని దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అక్టోబర్ 10 నుంచి 21 వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్, వంశపారంపర్య చైర్మన్ వంగల లక్ష్మణ్ తెలిపారు. శృంగేరి పీఠాధిపతులు సమర్పించిన పట్టు వస్త్రాలు, మంత్ర అక్షింతలతో ప్రకాశం గంజ్‌లోని శ్రీ వరసిద్ధి వినాయక ఆలయం నుంచి నగునూరు దుర్గా భవాని ఆలయం వరకు గురువారం సాయంత్రం శోభాయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. అమ్మవారి మూలవిరాట్టుకు సుమారు 8 కిలోల బంగారంతో ఆభరణాలు, కవచాలు తయారు చేయాలని ఆలయ కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు భాగస్వాములు కావాలని, తమకు తోచిన విధంగా కనీసం ఒక గ్రాము బంగారం సమర్పించాలని కోరారు. నవరాత్రుల్లో బ్రాహ్మీ, మాహేశ్వరి, కుమారీ, వైష్ణవీ, లలిత త్రిపుర సుందరి, సరస్వతి, ఇంద్రాణి, దుర్గా భవాని, అన్నపూర్ణ, విజయదుర్గా తదితర అలంకరణల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. దుర్గాష్టమి, మహార్నవమి వేడుకలతో పాటు విజయదశమి సందర్భంగా శమీపూజ, రామ్‌లీల కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 21న అర్ధనారీశ్వర అలంకరణ, సింహనంది వాహన సేవలు, దుర్గాభవానిసుందరేశ్వరుల పట్టాభిషేకం, రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వంగల లక్ష్మణ్, శృంగేరి పీఠం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పీవీ మురళి కోరారు.



# ఇంజనీర్ కోల అన్నారెడ్డికి ఘన సన్మానం..

**కరీంనగర్, అక్టోబర్ 08(పిసి డబ్ల్యూ న్యూస్):** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన ఇంజనీర్ కోల అన్నారెడ్డి గారిని అభినందిస్తూ శ్రీపురం కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యం లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీపురం కాలనీ అద్యక్షుడు కర్నె రాజమౌళి, చిందం శ్రీనివాస్, మదాసు రామారావు, నల్ల రాజయ్య, చిపిరి శెట్టి సత్యనారాయణ , కోరుకంటి ప్రభాకర్ రావు, వానమామములై గీత వాసు, భాష్యం విజయసారథీ, ఇంజనీర్ లక్ష్మణ రావు, ఉమా, రమా గార్లు పాల్గొన్నారు. కొప్పుల ఈశ్వర్, జోగినిపెల్లి రవీందర్ రావు, బల్మూరి రామచందర్ రావులు అభినందనలు తెలియజేశారు.

# ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఫార్మా కంపెనీలో ఉద్యోగాలు

### - 75 రోజుల శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



**పెద్దపల్లి, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు గ్రాన్యూల్ ఫార్మా ఇండియా లిమిటెడ్‌లో 75 రోజుల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి ఉద్యోగాల్లో చేరనున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వారిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం లభించిన ఉద్యోగావకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణ, అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. నైపుణ్యాలను పెంపొందించుకుంటూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రముఖ సంస్థలో ఉద్యోగాలు పొందడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అధికారులు, శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిచెన్‌లో భోజన నాణ్యతపై తనిఖీ

**సిద్ధవటం అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రమైన సిద్ధవటంలోని స్మార్ట్ కిచెన్ సెంటర్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పి.కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం స్మార్ట్ కిచెన్‌ల ద్వారా నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించేందుకు చర్యలు చేపట్టిందని డాక్టర్ మురళీమోహన్ తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనం అందేలా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారి అరుణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ నరసమ్మ, సూపర్‌వైజర్ మౌలాలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డి.ఎస్.పి

**కర్నూలు అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ని పత్తికొండ నూతన డీఎస్పీ వంశీధర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం పత్తికొండ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వంశీధర్ గౌడ్ కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచం అందించారు. పత్తికొండ సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు.



# ములుగు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**- ఇసుక లారీ బీభత్సం.. సీఆర్పీఎఫ్ జవాన్ మృతి... పలువురికి తీవ్ర గాయాలు**





**ములుగు, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** గోవిందరావుపేటతాడ్వాయి మండలాల మధ్య అటవీ ప్రాంతంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా దూసుకొచ్చిన ఇసుక లారీ ఎదురుగా వస్తున్న సీఆర్పీఎఫ్ పోలీసు వాహనంతో పాటు ఓ ప్రైవేట్ కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కరీంనగర్ జిల్లాకు చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ మొగునూరి రమాకాంత్ అక్కడికక్కడే మృతి చెందారు. మరో జవాన్లు గిరీష్ కుమార్, ప్రేమ్ ప్రకాష్, రంజాన్ ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రైవేట్ కారులో ప్రయాణిస్తున్న ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన సయ్యద్ సఫియాకు కూడా గాయాలయ్యాయి. ప్రైవేట్ కారు ఇసుక లారీ కిందకు దూసుకుపోగా, పోలీసు వాహనం అదుపుతప్పి అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు.

# రాహుల్, ప్రియాంక అరెస్టుపై కరీంనగర్‌లో ఎన్ఎస్‌యూఐ నిరసన

**- అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మల దహనం**



**కరీంనగర్, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో అలుగునూరు చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యాదవల్లి వెంకటస్వామి పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా, ఎస్ఐఆర్‌పై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చేతన్ రెడ్డి, సాగర్, సన్నీ, అల్మాస్, రాము, రాజేష్, రాకేష్, సురేష్, నరేష్, దివాకర్, ధనంజయ్, అనుదీప్, అనురాగ్, విశాల్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ములుగు మున్సిపాలిటీలో బార్ అండ్ రెస్టారెంట్‌కు నోటిఫికేషన్

**- అక్టోబర్ 12 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**ములుగు, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు మున్సిపాలిటీ పరిధిలో ఒక బార్ అండ్ రెస్టారెంట్‌కు సంబంధించి ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్, ఐఏఎస్ ఉత్తర్వుల మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎక్సైజ్ అధికారి బి. కిరణ్ తెలిపారు. ఆసక్తి గల దరఖాస్తుదారులు రూ. 1 లక్ష దరఖాస్తు రుసుము చెల్లించి, ఆధార్, పాన్ కార్డుల ప్రతులను జతచేసి దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. బార్ వార్షిక రుసుము రూ. 30 లక్షలుగా నిర్ణయించామని, ఈ మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం అక్టోబర్ 10, 11 తేదీల్లో కూడా దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇచ్చిందన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎక్సైజ్ కార్యాలయం, డిప్యూటీ కమిషనర్ వరంగల్ కార్యాలయాల్లో కౌంటర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు అక్టోబర్ 12 సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే గడువు ఉంటుందని, చివరి రోజు రద్దీని నివారించేందుకు ముందుగానే దరఖాస్తులు సమర్పించుకోవాలని అధికారులు సూచించారు.

# వన్యప్రాణుల వేటకు విద్యుత్ ఉచ్చులు

**- ముగ్గురి కోసం అటవీశాఖ గాలింపు.. అధికారులకు చిక్కకుండా పరార్**



**ఏటూరునాగారం, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఏటూరునాగారం అభయారణ్యం పరిధిలో వన్యప్రాణుల వేటకు విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసిన ఘటన కలకలం రేపింది. జీడివాగు పరిసర అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు గుర్తించిన అటవీశాఖ అధికారులు ఎద్దు లోకేష్, చింతకింద రమేష్, బెస్త స్వామి కోసం గాలింపు చేపట్టారు. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ తీగలను గుర్తించి తొలగించారు. అయితే అధికారులు చేరుకునేలోపే అనుమానిత ముగ్గురూ అక్కడి నుంచి తప్పించుకున్నట్లు తెలిపారు. దక్షిణ అటవీ క్షేత్రాధికారి అబ్దుల్ రేహమాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు వారి ఆచూకీ కోసం గాలిస్తున్నాయి. వన్యప్రాణుల వేటకు విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని అధికారులు తెలిపారు. ఇలాంటి చర్యల వల్ల వన్యప్రాణులతో పాటు అటవీ ప్రాంతాల్లో సంచరించే ప్రజలకు కూడా ప్రాణహాని కలిగే అవకాశం ఉందని హెచ్చరించారు. అక్రమ వేటను అరికట్టేందుకు అటవీ ప్రాంతాల్లో నిఘాను మరింత ముమ్మరం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# వివేకానంద డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**విద్యార్థులు లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి: మేయర్ కొలగాని శ్రీనివాస్**






**కరీంనగర్, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రేకుర్తిలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం రాజశ్రీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. వివేకానంద విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలో చదివి వివిధ రంగాల్లో రాణించిన పూర్వ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇదే కళాశాలలో విద్యార్థిగా చదువుకున్న మేయర్ తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. విద్యార్థి దశలో తాను చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాల ద్వారా 690 మందికి రక్తదానం చేయించిన విషయాలను విద్యార్థులతో పంచుకున్నారు. మేయర్ మాట్లాడుతూ కష్టపడి, పట్టుదలతో పనిచేస్తే లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక సేవా రంగాల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరచాలని సూచించారు. స్వామి వివేకానంద, భగత్‌సింగ్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నేటి యువతే రేపటి దేశ సంపద, శక్తి అని పేర్కొంటూ విద్యార్థులు తల్లిదండ్రులు, గురువుల పేరును నిలబెట్టేలా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి. శ్రీరంగ ప్రసాద్, సెక్రటరీ, కరస్పాండెంట్ వి. ఆగం రావు, త్రీ టౌన్ సీఐ తిరుమల్ గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రామప్ప పరిరక్షణకు చైతన్య ర్యాలీ

**- ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టును నిలిపివేయాలి : మానవ హక్కుల వేదిక**



**వెంకటాపురం, అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామప్ప చెరువు, ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప దేవాలయ పరిరక్షణ కోసం ఓపెన్ కాస్ట్ బొగ్గు తవ్వకాలను వ్యతిరేకిస్తూ మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో చైతన్య ర్యాలీ నిర్వహించనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్.వి తెలిపారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాలంపేటలోని రామప్ప చెరువుకు సమీపంలో సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో ప్రతిపాదిత ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రామప్ప చెరువుకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ప్రాజెక్టు ఉండటంతో చెరువు భద్రతపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో జరిగే పేలుళ్ల కారణంగా భూగర్భ పొరల్లో మార్పులు, పగుళ్లు ఏర్పడితే రామప్ప చెరువు భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని దిలీప్ తెలిపారు. అదే విధంగా సుమారు 800 ఏళ్ల చరిత్ర కలిగిన యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప దేవాలయంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం సుమారు 4 వేల ఎకరాల భూమి సేకరణ జరిగే అవకాశం ఉండటంతో పెద్ద సంఖ్యలో రైతులు, స్థానికులు తమ భూములను కోల్పోయి నిరాశ్రయులయ్యే పరిస్థితి ఏర్పడవచ్చని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల జీవనాధారాలను కాపాడేందుకు ప్రభుత్వం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుపై పునరాలోచించాలని కోరారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 10, 2026 శనివారం ఉదయం 8 గంటలకు జంగాలపల్లి క్రాస్ నుంచి వెంకటాపురం మండల కేంద్రం వరకు చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ ప్రేమికులు, రైతులు, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ పిలుపునిచ్చింది.

# అంగన్వాడీ, పాఠశాల, పల్లె దవాఖానల్లో పీఓ ఆకస్మిక తనిఖీలు

**చిన్నారుల అభ్యసన స్థాయి.. విద్యార్థుల విద్యా ప్రమాణాలు.. వైద్య సేవలపై ఆరా**



**ఏటూరునాగారం, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ విద్య, వైద్య సంస్థల్లో సేవల నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో గురువారం ఏటూరునాగారం మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆకులవారి ఘనపూర్ అంగన్వాడీ కేంద్రం, జీపీ పాఠశాల, ఏటూరునాగారం సబ్‌సెంటర్-1 (పల్లె దవాఖాన), సబ్‌సెంటర్-2లను సందర్శించి సేవలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు, రికార్డులు, అభ్యసన సామగ్రి, పోషకాహారం పంపిణీని పరిశీలించిన పీఓ.. చిన్నారులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయిని తెలుసుకున్నారు. నోట్‌బుక్స్‌ను పరిశీలించి వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పల్లె దవాఖానల్లో మందుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, ఓపీ వివరాలు, రోగుల నమోదు, వైద్య పరికరాల వినియోగాన్ని పరిశీలించారు. గ్రామీణ ప్రజలకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ విద్య, వైద్య సంస్థల్లో సేవలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని పీఓ స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు, సిబ్బందికి సూచించారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం



**- ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు సహకరించినందుకు కృతజ్ఞతగా కార్యక్రమం**




**జవహర్‌నగర్, అక్టోబర్ 8 (బీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో భాగంగా కేకే కమిటీకి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించడం, కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడుతున్నందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమకారులు పాలాభిషేకం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ 9న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఐక్య కార్యాచరణ కమిటీ తెలిపింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నందుకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీలు కోదండరామ్, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ లేబర్ బోర్డు సభ్యుడు మోతే శోభన్ రెడ్డి, ఫుడ్ కమిటీ బోర్డు సభ్యుడు వోరిగంటి ఆనంద్‌తో పాటు ఉద్యమ నేతలు ప్రఫుల్ రామ్ రెడ్డి, సుల్తాన్ యాదగిరి, అడ్వకేట్ పాండు గౌడ్, రామ్ గిరి ప్రకాష్, మల్లూరి అనిల్ కుమార్, సామ అంజిరెడ్డి, తోడేటి శంకర్ గౌడ్ తదితరులు హాజరుకానున్నారు. తెలంగాణ ఉద్యమానికి సేవలందించిన ఉద్యమకారులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐక్య కార్యాచరణ కమిటీ చీఫ్ కన్వీనర్ సుల్తాన్ యాదగిరి కోరారు.

# కష్టాల్లో నేనున్నా.. ఆపదలో అండగా నాగరమేష్ సేవా హస్తం

**- బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా.. జగదీష్ సేవలు చిరస్మరణీయం**

**మల్లంపల్లి, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలవడమే లక్ష్యంగా మల్లంపల్లి బీఆర్ఎస్ నాయకులు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా బీఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి, శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగరమేష్ పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.ములుగు జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు గోవింద్ నాయక్‌తో కలిసి మల్లంపల్లి మండలంలోని బాధిత కుటుంబాలను పరామర్శించారు. మల్లంపల్లి గ్రామంలో 70 పందులు మృతి చెంది నష్టపోయిన గంట చిన్ని కుటుంబాన్ని, శ్రీనగర్‌లో కుమారుడు, కోడలు మృతి చెందిన మేకల రాజేశం కుటుంబాన్ని పరామర్శించారు. మంచినీళ్లపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన మహమ్మద్ అజ్జిజు కుటుంబానికి ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం అందించారు.అలాగే ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న వృద్ధురాలు జంగం దేవేంద్రను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న మల్లంపల్లి గ్రామానికి చెందిన సారా లక్ష్మిని పరామర్శించి చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా నాగరమేష్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడం, కష్టాల్లో ఉన్నవారికి





భరోసా కల్పించడమే తన సేవా లక్ష్యమన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో తనవంతు సహాయం అందిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు. **జగదీష్ సేవలు చిరస్మరణీయం**ములుగు జిల్లా బీఆర్ఎస్ తొలి అధ్యక్షుడు, తొలి జడ్పీ చైర్మన్ స్వర్గీయ కుసుమ జగదీష్ తల్లిదండ్రులను నాగరమేష్ మర్యాదపూర్వకంగా కలిసి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగదీష్ పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమానికి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివన్నారు. ఆయన మరణం పార్టీకి, కార్యకర్తలకు తీరని లోటని పేర్కొన్నారు. జగదీష్ ఆశయాలను, ప్రజాసేవలో ఆయన చూపిన మార్గాన్ని కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కొమరం ధనలక్ష్మి, ఖుర్బన్ అలీ, ప్రభాకర్, ఆకుల మల్లేష్, శ్రీనివాస్ రెడ్డి, గోల్కొండ రాజు, రేణిగుంట్ల సురేష్, మహమ్మద్ పాషా, కుక్కల సంపత్, ఓన్నాల మహేష్, అలీ రంజాన్, రాజ్‌కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాటేటి వేణుగోపాల్ తండ్రి మృతి విషాదకరం

**• కుటుంబాన్ని పరామర్శించిన రాజ్యాంగ పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ • శ్రీరాంరావు సేవలను స్మరించుకున్న నేత**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సీనియర్ జర్నలిస్ట్, నమస్తే తెలంగాణ బ్యూరో చీఫ్ మాటేటి వేణుగోపాల్‌రావు తండ్రి మాటేటి శ్రీరాంరావు మృతి తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని రాజ్యాంగ పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు, వ్యవస్థాపకులు సయ్యద్ సాదిక్ అలీ అన్నారు. ఆత్మీయుడిని కోల్పోయిన కుటుంబ సభ్యుల బాధను పంచుకుంటూ, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.గురువారం మామిళ్లగూడెంలోని మాటేటి వేణుగోపాల్‌రావు నివాసానికి వెళ్లిన సయ్యద్ సాదిక్ అలీ, శ్రీరాంరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆప్తుడిని కోల్పోయిన వేళ కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోస్థైర్యం కలగాలని ఆకాంక్షించారు. మాటేటి శ్రీరాంరావు పోలీస్ పటేల్‌గా, అనంతరం రెవెన్యూ అధికారిగా సుదీర్ఘకాలం ప్రజలకు సేవలందించారని సాదిక్ అలీ గుర్తుచేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో పనిచేస్తూ ప్రజలకు సేవ చేయడం ద్వారా సమాజంలో తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు.తండ్రిని కోల్పోవడం ప్రతి ఒక్కరి జీవితంలోనూ తీరని లోటని, ముఖ్యంగా సీనియర్ జర్నలిస్ట్ మాటేటి వేణుగోపాల్‌రావు కుటుంబానికి ఈ విషాదం పూడ్చలేని లోటును మిగిల్చిందని సాదిక్ అలీ అన్నారు. కన్నతండ్రి జ్ఞాపకాలు జీవితాంతం కుటుంబ సభ్యులకు అండగా నిలవాలని, శ్రీరాంరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మాటేటి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడి, వారి బాధను పంచుకున్నారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# ఓటు హక్కు పరిరక్షణకు మరో పోరాటం

**- జ్ఞానేష్‌కుమార్ బీజేపీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపణలు: వైద్యుల అంజన్‌కుమార్**

**కరీంనగర్, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):**ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద బుధవారం 'బ్లాక్ డే' నిరసన చేపట్టారు. ఓటర్ల జాబితాలో అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపీలపై జరిగిన లాఠీచార్జ్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రసాదించిన ఓటు హక్కును కూడా దొంగిలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణపై ఎన్నికల కమిషన్‌లోని ఇద్దరు కమిషనర్లు




14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినా నిర్ణయాలు కొనసాగుతున్నాయని అన్నారు. జ్ఞానేష్‌కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోందన్నారు.దేశంలో బంగారం, నగదు దొంగతనాలు చూశామని, ఇప్పుడు ఓటు హక్కుపై కూడా దొంగతనం ఆరోపణలు రావడం ఆందోళనకరమని అంజన్‌కుమార్ అన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం మరో స్వాతంత్ర్య పోరాటానికి నాంది పలకాల్సిన అవసరం ఉందన్నారు. నేటి యువతతో పాటు జనరేషన్ జెడ్, జనరేషన్ ఆల్ఫా కూడా ఈ అంశంపై చర్చిస్తోందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్య, మల్లికార్జున రాజేందర్, కల్లెపల్లి బాలరాజు, సరిల్ల ప్రసాద్, వరాల నర్సింగం, చాడగొండ బుచ్చిరెడ్డి, భాస్కర్ నాయక్, బోనాల శ్రీనివాస్, గంట కళ్యాణి, ఫహాద్, ఆకుల ఉదయ్, వెన్నం రజితారెడ్డి, కోడూరు రవీందర్‌గౌడ్, అబ్దుల్ రెహమాన్, మాదాసు శ్రీనివాస్, మాజీద్ అలీఖాన్, శ్రీధర్‌రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కిసాన్ నగర్ బండి సంజయ్ అడ్డా...

**• గంగుల అవినీతిపై అసెంబ్లీలోనే చర్చకు వచ్చింది: బీజేపీ నేతలు**





**కరీంనగర్, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):**"కిసాన్ నగర్ అంటే బండి సంజయ్ అడ్డా.. ఈ ప్రాంత ప్రజలతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉంది" అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కిసాన్ నగర్ నుంచి చింతల వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ.. బీజేపీకి సంబంధించిన కార్యక్రమాలు, ఎన్నికల ప్రచారాలు కిసాన్ నగర్ నుంచే ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కిసాన్ నగర్ ప్రజలకు బండి సంజయ్‌పై ఉన్న ఆదరణను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మార్చలేవని అన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు, ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు.డిప్యూటీ మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ.. బండి సంజయ్ ఎంపీగా, ప్రస్తుతం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అమృత్-1, అమృత్-2, స్మార్ట్ సిటీ, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా కేంద్రం నుంచి కరీంనగర్‌కు వందల కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చారని అన్నారు. కిసాన్ నగర్‌లో రూ.65 కోట్లతో చేపట్టినట్లు చెబుతున్న అభివృద్ధి పనుల్లో రహదారులు, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతులకు స్మార్ట్ సిటీ నిధులే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు.మాజీ మంత్రి గంగుల కమలాకర్ పాలనపై బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. ఆయన హయాంలో చేపట్టిన ఐటీ టవర్, మానేరు రివర్ ఫ్రంట్, కేబుల్ బ్రిడ్జి పనుల వల్ల ప్రజలకు కలిగిన ప్రయోజనాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గంగులపై అవినీతి, భూకబ్జాలకు సంబంధించిన ఆరోపణలు గతంలో అసెంబ్లీలోనూ చర్చకు వచ్చాయని అన్నారు.కరీంనగర్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ కేవలం ఎనిమిది స్థానాలకే పరిమితం కావడం ప్రజల తీర్పుకు నిదర్శనమని సునీల్‌రావు అన్నారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావుతో పాటు బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

# బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

**- రూ.2.80 కోట్ల అంచనా వ్యయంతో కరీంనగర్‌లో విస్తృత ఏర్పాట్లు**

**కరీంనగర్, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కరీంనగర్ నగరపాలక సంస్థ విస్తృత ఏర్పాట్లు చేపడుతోంది. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాల కోసం సుమారు రూ. 2.80 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నట్లు మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు.నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ అధ్యక్షతన, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సమక్షంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలోని 66 డివిజన్లలో బతుకమ్మ పాయింట్లు, నిమజ్జనం కేంద్రాలు, అంబేద్కర్ స్టేడియంలో దసరా వేడుకలకు అవసరమైన సివిల్, విద్యుత్, పారిశుధ్య, లైటింగ్ ఏర్పాట్లపై చర్చించారు.బతుకమ్మ పాయింట్లు, నిమజ్జనం కేంద్రాల్లో బారికేడింగ్, అదనపు లైటింగ్, తాగునీరు, పారిశుధ్యం, వేదికలు, సౌండ్ సిస్టమ్స్, జనరేటర్లు,




వీధి దీపాలు, చదును పనులు, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మేయర్ అధికారులను ఆదేశించారు. పోలీసు, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుని ఉత్సవాలకు మూడు రోజుల ముందుగానే అన్ని పనులు పూర్తి చేయాలని సూచించారు. **అంబేద్కర్ స్టేడియంలో దసరా వేడుకలు** అంబేద్కర్ స్టేడియంలో దసరా ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, లైటింగ్, వేదిక నిర్మాణం, రావణ దహనం తదితర కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మేయర్ తెలిపారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం కేంద్రాల వద్ద ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సమావేశంలో అదనపు కమిషనర్ ఆయాజ్, డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణుమాధవ్, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహార్, ఇన్‌చార్జ్ ఈఈ లచ్చిరెడ్డితో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం కప్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు..

**- గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి నందకిషోర్ ఎంపిక..**





**గంగాధర, అక్టోబర్ 8(పీసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం కరీంనగర్ జిల్లాలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి 2వ ఎడిషన్ సీఎం కప్ పోటీలలో, అండర్-19 విభాగం వాలీబాల్ పోటీలలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, గంగాధర లో ఎంపీసీ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థి మంచికట్ల నందకిశోర్ ఎంపిక కావడం జరిగింది. చిన్ననాటి నుండి ఆటల పట్ల మక్కువ కలిగినటువంటువంటి మంచి కట్ల నందకిశోర్ వాలీబాల్ విభాగంలో ఉత్తమ ప్రదర్శనను కనబరచడం జరిగింది. హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియం లో ఈ నెల 20 నుండి 22వ తేదీ వరకు జరిగే జరగబోయే రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రికెట్ టోర్నీలో నందకిశోర్ కరీంనగర్ జిల్లా తరపున పాల్గొనబోతున్నారు.ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ జె.ఇందూర గారు, స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎల్. సురేష్ మరియు అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు నందకిశోర్ ను అభినందించడం జరిగింది.

# ఎంఐఎం బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలి

**- వర్గ విభేదాలను వీడి పార్టీ పటిష్టతకు పనిచేయాలి: అసదుద్దీన్ ఒవైసీ**





**కరీంనగర్, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):**వర్గ, విభేదాలను పక్కనబెట్టి ఎంఐఎం బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ పిలుపునిచ్చారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎంఐఎం అధ్యక్షుడిగా సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, కరీంనగర్ పట్టణ అధ్యక్షుడిగా మహమ్మద్ అతీఫ్‌ను నియమించారు. హైదరాబాద్ దారుస్సలాంలో నూతనంగా నియమితులైన వారికి అసదుద్దీన్ ఒవైసీ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా, పట్టణ కమిటీలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. తనపై నమ్మకంతో కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీకి సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు. మూడు జిల్లాల్లో పార్టీ అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై అభ్యంతరకర ఫ్లెక్సీలు..

**● బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు, అనుచరులపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని ఫిర్యాదు**



**కరీంనగర్, అక్టోబర్ 08 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లోని కిసాన్ నగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, ఘర్షణ వాతావరణానికి కారణ మవుతున్నారంటూ బీఆ ర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు 29వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు, ఆయన అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ త్రీ టౌన్ సీఐకి ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీల ఏర్పాటు ద్వారా పలు వర్గాల మధ్య ఉద్రిక్తతలు, అల్లర్లు చెలరేగే పరిస్థితులు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, సోమిడి వేణు మరియు ఆయన అనుచరులపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని పోలీసులను బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కిసాన్ నగర్ ప్రాంతంలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

**- ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఖమ్మంలో భారీ నిరసన ర్యాలీ**










**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):**ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన పెవిలియన్ గ్రౌండ్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు గురువారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఓట్ల దొంగతనం, ఓటర్ల జాబితాలో అవకతవకలు, ఈవీఎంలపై నెలకొన్న అనుమానాలకు ఎన్నికల కమిషన్ తీరే కారణమని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అంబేద్కర్ విగ్రహం సాక్షిగా ఇండియా కూటమి పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి భాగం హేమంతరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి నర్సయ్య, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు గోపగాని శంకర్ తదితరులు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ తీరుపై విమర్శలు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అన్ని పార్టీలు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, వివిధ పార్టీల జిల్లా నేతలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్లు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాల్సిందే...

**- ఖమ్మంలో నినదించిన ఇండియా కూటమి**

**- పెద్ద సంఖ్యలో పాల్గొన్న వామపక్ష, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు, విద్యార్థి, యువజనులు: సిసిప సంపూర్ణ మద్దతు**





ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) : ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్కుమార్ రాజీనామా చేయాల్సిందేనని విపక్షాలు నినదించాయి. తప్పుడు మార్గంలో ఎన్నికలు నిర్వహిస్తున్న పద్ధతిని మార్చాలని డిమాండ్ చేశాయి. ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ గురువారం ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెవిలియన్ మైదానం నుంచి మయూరిసెంటర్ పాత బస్టాండ్ మీదుగా జెడ్పి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) మాస్స్, సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీని ఉద్దేశించి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ జ్ఞానేష్కుమార్ ఎన్నికల అధికారిలా కాకుండా బిజెపి కార్యకర్తలా వ్యవహరించారని ఆరోపించారు. ఆయన నిర్వహించిన ఎన్నికల అన్నింటికి సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరపాలని హేమంతరావు డిమాండ్ చేశారు. మోడీ ప్రజా మద్దతుతో గెలవలేక ఎన్నికల సంఘాన్ని తన గెలుపుకోసం వాడుకున్నారని ఆయన తెలిపారు. ఎన్నికల కమిషనర్గా మోడీ, అమిత్ షా తమ ఏజెంటును నియమించుకున్నారన్నారు. కోట్లాది మంది ఓట్లను తొలగించడం ద్వారా ప్రజాస్వామ్య అస్థిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చారని హేమంతరావు ఆరోపించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ... బిజెపి ఓట్ల చోరీకి పాల్పడుతుందని ఓటర్ల జాబితాలో అవకతవకలు, ఈవిఎంలో చోటు చేసుకున్న మాయ బిజెపికి గెలుపుకు కారణమయ్యాయన్నారు. జ్ఞానేష్ కుమార్ పదవిలో ఉండటానికి అనర్హుడని తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణులు ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తున్నాయని ఈ పోరాటంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిలా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, ప్రత్యామ్నాయ పౌర సమాజం బాధ్యులు గోపగాని శంకర్రావు తదితరులు ప్రసంగించగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్, జానిమియా, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, కాంగ్రెస్ నాయకులు పోట్ల నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుంబూరు దయాకర్రెడ్డి, తుమ్మల యుగంధర్, కట్ల రంగారావు, సిపిఎం నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై. విక్రం, యర్రా శ్రీనివాస్, మాస్లైన్ నాయకులు ఆవుల అశోక్, జన సమితి నాయకులు గోపగాని శంకర్రావు, కాంగ్రెస్ నాయకురాలు దొబ్బల సౌజన్య, బచ్చలకూరి నాగరాజు, బాలాజీ నాయక్, సిసిప బాధ్యులు కాకి భాస్కర్, విజయ్, యువజన విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# శ్రీచైతన్యలో ఐఐటీ బాంబే ఇన్నోవేషన్ వర్క్‌షాప్

**● నూతన ఆవిష్కరణల వైపు విద్యార్థుల అడుగులు**









**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించి, వాటిని సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలుగా మలిచే లక్ష్యంతో శ్రీచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్‌లో ఐఐటీ బాంబే ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. ఐఐటీ బాంబే ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ సెల్ ఏర్పాటుకు దేశవ్యాప్తంగా ఎంపికైన 15 కళాశాలల్లో శ్రీచైతన్యకు చోటు దక్కడం గర్వకారణమన్నారు. ఐఐటీ బాంబే ఎలక్ట్రికల్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ధనలక్ష్మి గోపాల్‌ను కళాశాల మెంటార్‌గా నియమించినట్లు తెలిపారు. ఇన్నోవేషన్ సెల్ ద్వారా విద్యార్థులు సమాజంలో ఉన్న సమస్యలను గుర్తించి, వాటికి సాంకేతిక పరిష్కారాలను రూపొందించేలా ప్రోత్సాహం లభిస్తుందని శ్రీధర్ అన్నారు. పుస్తకాలకే పరిమితం కాకుండా ఆలోచించే, ఆవిష్కరించే, ఆచరణలో పెట్టే యువతగా ఎదగడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఐఐటీ బాంబే ప్రతినిధి షేక్ సాహిల్ జమీల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ సెంటర్లు, వ్యాపార ఆవిష్కరణలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. విద్యార్థుల ఆలోచనలకు సరైన మార్గదర్శకత్వం అందించి, భవిష్యత్‌లో సొంత స్టార్టప్‌లు ప్రారంభించే స్థాయికి ఎదిగేలా సహకరిస్తామని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట చలపతి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. ఎలక్ట్రికల్ విభాగాధిపతి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వర్క్‌షాప్‌లు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డీన్ అకాడమిక్స్ డాక్టర్ సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కిషోర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ హెడ్ డాక్టర్ మురళీమోహన్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక

**- అన్ని జంక్షన్లను అధ్యయనం చేసి అవసరమైన చర్యలు చేపట్టాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి, అక్టోబర్ 8 (పీసీడబ్ల్యూ న్యూస్):**పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అన్ని ప్రధాన జంక్షన్లను సమగ్రంగా అధ్యయనం చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో డీసీపీ రామ్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో ట్రాఫిక్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీకి గల కారణాలను గుర్తించి, అవసరమైన చోట వన్‌వే, టూ-వే విధానాలను నిబంధనల ప్రకారం ప్రయోగాత్మకంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. కనీసం వారం రోజుల పాటు వాటి ప్రభావాన్ని పరిశీలించి, రాకపోకలపై వచ్చిన ఫలితాలను అధ్యయనం చేసిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికలను నిబంధనల ప్రకారం రూపొందించి అవసరమైన ప్రాంతాల్లో అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టి, పోలీసు, మున్సిపల్, రోడ్లు భవనాల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోడ్లపై ఆవులు, గేదెలు, ఇతర పశువులు సంచరించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాటిని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించి, రూపొందించిన ప్రణాళికల అమలును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమీక్షలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఆర్అండ్‌బీ ఈఈ భావ్‌సింగ్, ట్రాఫిక్ పోలీసు అధికారులు, రోడ్లు భవనాల శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కెజిబివీలపై వరుస తనిఖీలు.. కాంట్రాక్టు ఉద్యోగుల్లో కలవరం.!

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చిన్నగూడూరు కెజిబివీ తనిఖీతో మళ్లీ చర్చ..
- రాజకీయ ఆరోపణల మధ్య ఉద్యోగుల ఆవేదన.. "మా ఉద్యోగాలతో చెలగాటం వద్దు"
- డోర్నకల్ నియోజకవర్గంలోని కెజిబివీలపై ప్రత్యేక దృష్టి ఎందుకంటూ ప్రశ్నలు



**మహబూబాబాద్ ప్రత్యేక ప్రతినిధి, అక్టోబర్ 8(పిసిడబ్ల్యూ న్యూస్):** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కెజిబివీ) మరోసారి రాజకీయ పరిపాలనా చర్చకు కేంద్రంగా మారాయి. డోర్నకల్ నియోజకవర్గంలోని చిన్నగూడూరు కెజిబివీని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తనిఖీ చేయడం, పాఠశాల నిర్వహణపై పలు ఆరోపణలు ప్రభుత్వం పై చేయడం కలకలం రేపింది. ఈ పరిణామాల నేపథ్యంలో కెజిబివీల్లో ఏళ్లుగా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. **వరుస పరిణామాలతో కలవరం** కెజిబివీల్లో పనిచేస్తున్న కొందరు ఎస్ఓలు, ఉపాధ్యాయులపై ఇటీవల చోటుచేసుకున్న చర్యలు ఉద్యోగ వర్గాల్లో చర్చకు దారితీశాయి. కురవి మండలం నేరడ కెజిబివీ ఎస్ఓపై చర్యలు, డోర్నకల్ ఎస్ఓకు షోకాజ్ నోటీసు జారీ కావడం, తాజాగా చిన్నగూడూరు కెజిబివీని తనిఖీ చేయడం వంటి పరిణామాలు వరుసగా చోటుచేసుకోవడంతో ఉద్యోగుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. తమపై వచ్చిన ఆరోపణలు వాస్తవమా? కాదా? అన్నది సమగ్ర విచారణతో తేల్చాల్సి ఉండగా, వరుస తనిఖీలు, నోటీసులతో మానసిక ఒత్తిడికి గురవుతున్నామని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు. **తనిఖీ వెనుక రాజకీయ కోణమా...?** చిన్నగూడూరు కెజిబివీ తనిఖీ అనంతరం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విద్యాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి పాఠశాల పరిస్థితులపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారానికి రాజకీయ కోణం ఉందా? అన్న అనుమానాలను కొందరు ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ అంశంపై సంబంధిత అధికారులు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ వర్గం నుంచి పూర్తి వివరణ వెలువడాల్సి ఉంది. ఆరోపణల్లో వాస్తవాలు ఎంతవరకు ఉన్నాయన్నది అధికారిక విచారణ ద్వారానే స్పష్టమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. **15 ఏళ్ల సేవ.. ఇంకా కాంట్రాక్టే..!** కెజిబివీల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి మరోసారి ప్రశ్నార్థకంగా మారింది. 15 ఏళ్లుగా సేవలందిస్తున్నా ఉద్యోగ భద్రత లేకపోవడం, ప్రతి చర్య తమ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందన్న భయంతో పనిచేయాల్సి రావడం బాధాకరమని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."తప్పులు జరిగితే విచారణ చేయండి. బాధ్యులపై చర్యలు తీసుకోండి. కానీ ఆధారాలు లేకుండా ఉద్యోగులపై ముద్ర వేయడం, తనిఖీల పేరుతో మానసిక ఒత్తిడికి గురిచేయడం సరికాదు" అని పలువురు ఉద్యోగులు అంటున్నారు. **"మా జీవితాలతో చెలగాటం వద్దు"** చిన్నపాటి పరిపాలనా లోపాలు ఉన్నట్లయితే వాటిని సరిదిద్దేందుకు అవకాశం ఇవ్వాలని, విద్యార్థినుల విద్యాభ్యాసానికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు. "మా ఉద్యోగ జీవితాలను అగమ్యగోచరంగా చేసే నిర్ణయాలు తీసుకోవద్దు. తప్పులు ఉంటే పారదర్శకంగా విచారణ చేయండి. కానీ రాజకీయ ఆరోపణల మధ్య చిరుద్యోగులను బలిపశువులను చేయొద్దు" అని పలువురు ఎస్ఓలు, ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. **ప్రభుత్వ స్పష్టతకు డిమాండ్** డోర్నకల్ నియోజకవర్గంలోని కెజిబివీల్లో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని ఉద్యోగులు కోరుతున్నారు. కెజిబివీల నిర్వహణలో లోపాలు ఉంటే వాటిని సరిదిద్దడంతో పాటు, ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తనిఖీలు.. నోటీసులు.. చర్యలు.. ఇవన్నీ ఎక్కడికి దారితీస్తాయన్నదే ఇప్పుడు కెజిబివీ ఉద్యోగుల్లో ప్రధాన ప్రశ్నగా మారింది..

# పశ్చిమాసియాకు మరో అగ్నిపరీక్ష

ఇప్పటికే అనేక సంక్షోభాలతో అట్టుడుకుతున్న పశ్చిమాసియాకు మరో ప్రమాద ఘంటిక మోగుతోంది. అటు యెమెన్ పైనా, ఇటు సౌదీ అరేబియాపైనా హూతీలు దాడులను తీవ్రతరం చేయడంతో పశ్చిమాసియా పరిస్థితి పెనంమీదనుంచి పొయ్యిలోకి పడినట్లయింది. హూతీలను అణచివేయడానికి సౌదీ అరేబియా సైనిక చర్యలను ముమ్మరం చేస్తున్న వేళ.. ఆ దేశానికి అండగా నిలిచేందుకు పాకిస్థాన్, తుర్కియే సిద్ధమవుతున్నాయి. ఆగస్టులో కుదిరిన మక్కా సంయుక్త రక్షణ ఒప్పందం కింద మూడు దేశాలూ సామూహిక రక్షణ చర్యలను అమలు చేయాలని నిర్ణయించడం ఈ పరిణామంలో కీలక మలుపు. మక్కా ఒప్పందం ఉద్దేశం ఒక సభ్యదేశంపై దాడిని మిగిలిన సభ్యదేశాలపై దాడిగా పరిగణించి సమష్టిగా స్పందించడం. హూతీల తాజా దాడుల నేపథ్యంలో రియాద్‌లో అత్యవసరంగా సమావేశమైన మూడు దేశాల రక్షణ, విదేశాంగ ఉన్నతాధికారులు ఒప్పందాన్ని ఆచరణలోకి తీసుకురావాలని నిర్ణయించారు. అవసరమైన సైనిక సామర్థ్యాలను త్వరగా సౌదీకి తరలించేందుకు కూడా అంగీకారం కుదిరింది.అయితే బలగాల సంఖ్య, వాటి కచ్చితమైన పాత్ర బహిర్గతం కాలేదు. పాకిస్థాన్ ఇప్పటికే సౌదీ రక్షణలో తన బలగాలను వినియోగిస్తుండగా, తుర్కియే విషయంలో పార్లమెంటరీ అనుమతులు వంటి అంశాలు ఇంకా కీలకంగా ఉన్నాయి. ఇప్పటివరకు సౌదీ -హూతీల ఘర్షణ ప్రధానంగా యెమెన్ అంతర్గత యుద్ధానికి పొడిగింపుగానే కనిపించింది. కానీ బాబ్ అల్-మందబ్ జలసంధిపై హూతీల పట్టు పెరగడం, ఎర్ర సముద్ర నౌకాయానానికి ముప్పు ఏర్పడటం, సౌదీ చమురు మౌలిక వసతులపై దాడుల భయం పెరగడంతో ఇది అంతర్జాతీయ భద్రతా సమస్యగా మారింది. ప్రపంచ వాణిజ్యానికి, చమురు రవాణాకు అత్యంత కీలకమైన ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారితే దాని ప్రభావం పశ్చిమాసియాను దాటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. సౌదీ అరేబియా ఇప్పటికే హూతీలపై భారీ ప్రతిదాడికి సన్నాహాలు చేస్తోంది.యెమెన్‌లోని ప్రభుత్వ అనుకూల బలగాలను ముందుండేలా చేసి, తమ వైమానిక దళాల మద్దతుతో భూతల దాడులు సాగించాలన్నది రియాద్ వ్యూహంగా కనిపిస్తున్నది. పాకిస్థాన్, తుర్కియే కూడా ఈ ప్రయత్నానికి రక్షణ, నిఘా, సాంకేతిక సహకారం అందించే దిశగా కదులుతున్నాయి. అయితే ఇవి ప్రత్యక్ష యుద్ధంలో ఎంతవరకు పాల్గొంటాయన్నదే అసలు ప్రశ్న. హూతీలకు ఇరాన్ మద్దతు ఉందన్న సంగతి బహిరంగ రహస్యమే. ఇప్పటికే ఇరాన్- అమెరికా సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న సమయంలో యెమెన్ మరో యుద్ధరంగంగా మారితే పశ్చిమాసియాలో పరిస్థితి బహుముఖ ఘర్షణకు దారితీయవచ్చు. సౌదీ లక్ష్యం హూతీల సామర్థ్యాన్ని పరిమితం చేయడమే అయినప్పటికీ, హూతీలు అందుకు ప్రతిగా సౌదీ చమురు క్షేత్రాలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, నౌకాయాన మార్గాలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉంది.ఈ సంక్షోభంలో అమెరికా వైఖరి అత్యంత ఆసక్తికరమైన అంశం. ట్రంప్ ప్రభుత్వం ఇప్పటివరకు సౌదీకి నిఘా, లక్ష్య నిర్ధారణ సమాచారం వంటి సహాయం అందిస్తున్నప్పటికీ, హూతీలపై నేరుగా వైమానిక దాడులకు దిగేందుకు వెనుకాడుతున్నది. సౌదీ కోరిన ప్రత్యక్ష సైనిక సహాయాన్ని ప్రస్తుతానికి తిరస్కరించినట్లు అమెరికా వర్గాలు తెలిపాయి. మరో యుద్ధంలో చిక్కుకోవడానికి అమెరికా ఎంతమాత్రం సిద్ధంగా లేదన్న విషయాన్ని ఈ పరిణామం చెప్పకనే చెబుతోంది. ఒకవైపు సౌదీ భద్రత, మరోవైపు ఇరాన్‌తో ఉద్రిక్తత, ఇంకోవైపు ఎర్ర సముద్రంలో నౌకాయాన భద్రత.. ఈ మూడింటి మధ్య వాషింగ్టన్ సమతూకం పాటించాల్సి ఉంటుంది. అయితే హూతీల దాడులు అంతర్జాతీయ వాణిజ్యానికి లేదా అమెరికా మిత్రదేశాల కీలక మౌలిక వసతులకు తీవ్రమైన ముప్పుగా మారితే అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చలేం.మక్కా ఒప్పందం పత్రాలకే పరిమితమైన రక్షణ వ్యవస్థ కాదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

# (సి)'ఇసి'కిది పరీక్షా కాలమే!



ప్రతిష్ఠాత్మక భారత ఎన్నికల సంఘం (ఇసి) విశ్వసనీయత ఇప్పుడు పరీక్షకు నిలుస్తోంది. ఉన్నత రాజ్యాంగ సంస్థ పనితీరుపై మున్నెన్నడు లేనంతగా సందేహాల నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రజాస్వామ్యానికి ఊపిరి వంటి ఎన్నికల వ్యవస్థలో ఓటరే కీలకం. అసాధారణ సంఖ్యలో ఓటర్ల తొలగింపునకు కారణమవుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ఏడాది కాలంగా వివాదాస్పదమవుతుంటే, అందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ కారణమని, కేంద్ర ప్రభుత్వం చెప్పుచేతుల్లో ఉండి ఇసిని ఆయన ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా, చట్ట వ్యతిరేకంగా నడుపుతున్నారనేది ముఖ్య అభియోగం. ఆయన దిగిపోవాలని అంతటా ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ విషయంలో దేశంలోని పాలక ప్రతిపక్ష పార్టీలు రెండు భిన్నమైన వైఖరులు తీసుకున్న వేళ, దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇసికి, కేంద్ర ప్రభుత్వానికి తాజాగా నోటీసులిచ్చింది. ఇసి విశ్వసనీయత నిలుస్తుందా? తప్పు తేలితే సిఇసి బాధ్యతల నుంచి తప్పుకుంటారా? సుప్రీం తప్పిస్తుందా? తదుపరి ఏం జరగనుంది? ఇవన్నీ సమాధానం రావాల్సిన ప్రశ్నలే!చిన్న చిన్న నిర్వహణ లోపాలు తప్పిస్తే దశాబ్దాలుగా భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) దేశ ప్రజల విశ్వసనీయత చూరగొన్న సంస్థే! ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థది గొప్ప పేరే! 'ప్రభుత్వాలు వస్తుంటాయ్ పోతుంటాయ్, పార్టీలు పడుతుంటాయ్ లేస్తుంటాయ్.. కానీ, భారత ఎన్నికల సంఘం మాత్రం ఆయా పరిణామాలతో, ఎన్నికల ఫలితాలతో నిమిత్తం లేకుండా నిష్కామ కర్మ ఆచరించే ఒక స్వేచ్ఛగల, స్వతంత్ర -సాధికార రాజ్యాంగ సంస్థ' అని పేరుండేది. దాదాపు వంద కోట్ల ఓటర్లను రిజిష్టరు చేసుకొని, వారు స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల ప్రక్రియ నిర్వహించే సామర్థ్యం ఇసికి ఎలా అబ్బింది? సొంతంగా దేశవ్యాప్త అధికార, నిర్వహణ యంత్రాంగం లేకుండానే, వేర్వేరు (పార్టీల) ప్రభుత్వాల కింద పనిచేసే ఉద్యోగ వ్యవస్థ సహకారంతోనే ఇసి ఎన్నికల ప్రక్రియను సమర్థంగా నిర్వహిస్తోంది. ఇందుకు రాజ్యాంగం (అధికరణం 324) ఇసికి కల్పించిన విస్తృత అధికారాల పాత్ర అసాధారణమైంది. తొంబయ్యో దశకంలో టి.ఎన్. శేషన్ అనే ఓ అధికారి చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా నియమితులైన తర్వాతే ఇసి గొప్పతనం సామాన్యులకు కూడా తెలిసి వచ్చింది.ప్రలోభాలకు తావు లేకుండా ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి ఉన్న అవకాశాలు, అధికారాలను ఆయన గరిష్టంగా వినియోగించుకొని ఒక కొత్త వాతావరణాన్ని సృష్టించారు. ప్రలోభాలు, ప్రచార సరళి, ఎన్నికల్లో డబ్బు-మద్యం వినియోగం, నేర చరితుల కట్టడి... ఇలా పలు విషయాల్లో తొలి విడత ఎన్నికల సంస్కరణల అమలు భేషుగ్గా జరిగింది. కానీ, ఇంకొన్ని మార్పులకు మలి విడత సంస్కరణల అవసరం కొట్టొచ్చినట్టు కనిపించింది. అటువంటి తరుణంలో, 2023లో జరిగిన ఎన్నికల చట్టసవరణ, జ్ఞానేశ్ కుమార్ నియామకం, 'సర్' ప్రక్రియ వివాదాస్పదం కావడం, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కనుసన్నల్లో 'ఓట్ చోరీ' జరుగుతోందనే అభియోగాలు, అందుకు తగ్గట్టుగానే దేశంలో దాదాపు 13కోట్ల మంది ఓటర్ల పేర్ల తొలగింపు... వంటివి తెరపైకి వచ్చాయి. 'ఇసిలో ఏకాభిప్రాయమే కాదు, మెజారిటీ అభిప్రాయం కూడా చెల్లుబాటు కావడం లేదు. సిఇసి ఏకపక్షంగా నిర్ణయాల్ని దేశంపై రుద్దుతున్నారు' అని వచ్చిన ఓ మీడియా పరిశోధనా కథనం సంచలనం సృష్టించింది. దరిమిలా ఉత్పన్నమైన పరిస్థితులే సిఇసి జ్ఞానేశ్‌కుమార్ దిగిపోవాలనే డిమాండ్ కు కారణం.ఫారమ్-6 మార్చిందెవరు? 'శివ ధనుస్సు విరిచిందెవరు?' అని పాఠశాల తనిఖీ అధికారి అడిగితే, పిల్లలు, టీచర్లు, చివరకు హెడ్‌మాస్టర్ సైతం 'నేను కాదంటే, నేను కాదన్నా'రనే జోక్ గుర్తుండే ఉంటుంది. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో ఫారమ్- 6 (ఎన్నికల చట్టం రూల్స్ 1960) కీలకమైన మౌలిక దరఖాస్తు పత్రం. యుక్త వయసు వచ్చిన దేశపౌరులెవరైనా, తమను తాము తేలికగా ఓటరు కింద నమోదు చేసుకునేందుకు వీలు కల్పించే పత్రమిది. దీనిలో మార్పులు తెచ్చి, డిక్లరేషన్‌ను జతపరచి ప్రక్రియను సంక్లిష్టం చేశారని, ఓటరు తొలగింపునకు ఇదొక కారణమవుతోందనే ఆరోపణలున్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్‌లో లక్షలాది అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపునకు కారణమైన అంశాల్లో ఇదొకటనే విమర్శ ఉంది. ఈ ఫారమ్-6 మార్పులు ఇసిలో ఏకాభిప్రాయం ప్రకారం జరుగలేదని, ఇద్దరు కమిషనర్లు వ్యతిరేకించినప్పటికీ సిఇసి ఏకపక్షంగా నిర్ణయించారనేది అభియోగం. దీని ఆసరాగా, సిఇసి ద్వారా ఇసిని గుప్పిట్లో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున 'ఓటు చోరీ'కి పాల్పడిందన్నది విపక్షాల విమర్శ.రాజ్యాంగ నిర్మాతల స్ఫూర్తి ప్రకారం అలక్ష్యం వల్లో, నిర్లక్ష్యంతోనో ఒక అర్హునికి ఓటరు జాబితాలో చోటు దక్కకపోతేనే అది అప్రజాస్వామికం. అటువంటిది, తమకు ఓటేయరనే తలంపుతో, లక్ష్యం చేసుకొని కోట్ల కొలది పేర్లు గల్లంతు చేయడం దుర్మార్గమైన చర్య! 'మేం ఫారమ్ -6ని మార్చలేదు, కాకపోతే దానికి స్వీయ వాంగ్మూలం (సెల్ఫ్ డిక్లరేషన్)ని జతపరిచాము, అదీ 'సర్' ప్రక్రియ అమల్లో ఉన్న చోట మాత్రమే, అది కూడా ఇసి ఏకాభిప్రాయమేన'ని కమిషన్ తాజా ప్రకటన జారీ చేసింది. పైగా, ఫారమ్ -6కి డిక్లరేషన్ జత చేసిన మార్పును సుప్రీం కోర్టు లోగడే ఆమోదించిందనీ అందులో పేర్కొన్నారు. ఈ ప్రకటనకు ముందు, ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిఐఎల్) విచారిస్తూ సుప్రీం కోర్టు, ఫారమ్- 6 లో మార్పులపై ఇసికి, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 'ఫారమ్ -6 మార్పులకు మాకు ఏ సంబంధమూలేద'ని కూడా సుప్రీం స్పష్టత ఇచ్చింది. ఇప్పుడు బంతి ఇసి కోర్టులో ఉంది. పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ 'ఓట్ బచావో, దేశ్ బచావో' ఆందోళన చేపట్టింది. నవంబరు 1న జరిగే దేశవ్యాప్త ఆందోళనలో భాగం కమ్మని మిగతా పక్షాలకు పిలుపునిచ్చింది. సిఇసి ప్రజల విశ్వాసం కోల్పోయారని, వెంటనే తప్పుకోవాలనే దేశంలోని పలువురు మేధావులు, పౌర సంఘాల డిమాండ్‌తో ఉద్యమం బలోపేతమవుతోంది. ఊతమిస్తున్న గణాంకాలు ఓటర్ల పేర్ల తొలగింపులో ఇసి నిర్వాకం రాజ్యాంగ వ్యతిరేకంగా, చట్ట విరుద్ధంగా ఉందన్న విపక్షాల ఆరోపణలను కొన్ని గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఓటరు జాబితా సవరణ ఏదైనా.. జాబితాకు ఒక పేరు జత చేయడం/ తొలగించడంలో నిర్ణయాధికారం, ఎక్కడికక్కడగా ఉండే 'ఓటర్ల నమోదు అధికారి' (ఇఆర్ఒ) కి ఉండేది. కానీ, ఇసిసి జ్ఞానేశ్ కుమార్ నిర్వాకంలో అది కేంద్రీకృతమై ఇసి పరిధిలోకి వచ్చింది. ఇఆర్ఒలకు కనీస సమాచారం లేకుండానే, ఆ పరిధిలో మూకుమ్మడి పేర్ల తొలగింపులు వారి (ఎలక్ట్రానిక్) సంతకాలతో జరిగిపోవడం వారినే విస్మయ పరచిన సందర్భాలూ ఉన్నాయి. ఇదంతా ఢిల్లీలో కూర్చున్న ఇసి కనుసన్నల్లో, 'ఇసిఐ-నెట్' (యాప్) ద్వారా జరిగేది. ఏకపక్ష నిర్ణయం దేశ ప్రజలపై రుద్దడం తప్ప ఈ విషయంలోనూ 'ఏకాభిప్రాయం' లేదన్నది అభియోగం. కేంద్ర ప్రభుత్వ ఇష్టాయిష్టాలతో జరిగిందన్నది విపక్షాల ఆరోపణ. పశ్చిమబెంగాల్ ఉదాహరణ తీసుకుంటే ఈ దాష్టీకం దుష్పరిణామాలు తేటతెల్లమవుతాయి. సరిగ్గా ఎన్నికల ముందు 90లక్షల ఓటర్ల పేర్లు తొలగించగా, సరిదిద్దిన తర్వాత 60లక్షలపై చిలుకు ఓటర్ల పేర్లు తొలగిపోయాయి. పోలింగ్‌కు ముందు సుప్రీం కోర్టును సంప్రదించినా వారికి న్యాయం జరుగలేదు. 38.31 లక్షల మంది ట్రిబ్యునల్‌కు వెళ్లారు. అందులో 1.26 లక్షల (3%) కేసుల్ని ఇప్పటికి పరిష్కరించగా, అందులో 93 శాతం మంది అర్హులైన ఓటర్లేనని, వారు ఇటీవలి ఎన్నికల్లో తమ హక్కును నిర్దాక్షిణ్యంగా కోల్పోయారని స్పష్టమైంది. ఇదే వేగంతో ట్రిబ్యునళ్ల విచారణ సాగితే మొత్తం కేసుల పరిష్కారానికి 21 సంవత్సరాల కాలం పడుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. అంటే, ఈ క్రమంలో మంగళవారం ఉప ఎన్నికలు జరిగిన రేజినగర్, నందిగ్రామ్ లో సుమారు 19000 మంది ఓటర్లు (ఫిర్యాదీలు) మరోమారు తమ ఓటు హక్కును కోల్పోనున్నారు. ఇదెక్కడి న్యాయం? అన్నది సగటు ఓటరు ప్రశ్న. ఒత్తిడి ఎటు దారి తీసేనో? కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఓ చిత్రమైన మాట చెప్పారు. జ్ఞానేశ్‌కుమార్‌ను తప్పించడం, చట్ట వ్యతిరేకంగా సాగుతున్న 'సర్' ప్రక్రియను నిలిపివేయడం, ఇకపై ఎన్నికల్ని బ్యాలెట్ పత్రాలతో మాత్రమే నిర్వహించడం.. ఈ మూడంశాల్లో తాము రాజీలేని పోరు సాగిస్తామన్నారు. ఓటర్ల జాబితా నుంచి చనిపోయినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, రెండు- అంతకన్నా ఎక్కువ చోట్ల ఓటున్న వారి పేర్ల తొలగింపు తప్పనిసరిగా జరగాల్సిన (సర్) ప్రక్రియ. ఓటింగ్ యంత్రా (ఇవిఎం)ల ట్యాంపరింగ్‌కు తావు లేని విధాలు, పద్ధతులు వెతకాలి తప్ప, ఇంత జరిగాక ఇప్పుడు వెనక్కి వెళ్లి బ్యాలెట్ పత్రాలతో ఓటింగ్ అని పట్టుబడితే ప్రజలెలా స్వీకరిస్తారు అన్నది కూడా ప్రధాన ప్రతిపక్షం ఆలోచించాలి. ఒకవైపు రాజకీయ ఒత్తిడి ఇలా ఉంటే, రేపు ఇసి, కేంద్రం ఇచ్చే సమాధానాన్ని బట్టి తీర్పు ఉంటుందన్న సుప్రీం కోర్టు ఏం నిర్ణయిస్తుంది? అన్నదానిపైనే ఎన్నికల సంఘం విశ్వసనీయత ఆధారపడి ఉంది.

# హక్కుల హననంపై బిగించిన పిడికిలి



అసాధారణ మేధస్సు, నిరంతర అధ్యయనం, విస్తృత విషయ పరిజ్ఞానం, వాగ్ధాటి రచనా కౌశలం, ఆత్మీయత, ఆచరణశీలత, నిబద్ధత, నిమగ్నత, కార్యదీక్ష, అంకితభావం, మానవీయతా సుగుణం మొదలైన లక్షణాలన్నింటినీ తనలో మూర్తీభవింపజేసుకున్న అపురూప మేధావి బాలగోపాల్. కశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా తలెత్తిన హక్కుల ఉల్లంఘనలపై ఆయన అవిశ్రాంతంగా ఉద్యమించారు. ప్రత్యేకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయన హక్కుల ఉద్యమాలకు దశ-దిశను నిర్దేశించారు. బాలగోపాల్ మధ్య తరగతి బ్రాహ్మణ పండిత కుటుంబంలో 1952, జూన్ 10 నాడు నాగమణి, పార్థనాథశర్మ దంపతులకు జన్మించారు. బాలగోపాల్ వరంగల్ లోని రీజినల్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎంఎస్సి అప్లైడ్ మాథ్స్‌ని అభ్యసించి అక్కడే డాక్టరేట్ చేస్తున్న క్రమంలో అక్కడ జరుగుతున్న రాడికల్ విద్యార్థి సంఘం కార్యక్రమాలను, ప్రజా పోరాటాలను సునిశితంగా పరిశీలించి రాజకీయ, తాత్విక సంఘర్షణలకు లోను అయ్యారు. 'తాను ప్రజల కోసం ఒక క్రియాశీల కార్యకర్తగా పనిచేయాలి' అని బాలగోపాల్ బలంగా నిర్ణయించుకొని 1981లో ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘంలో చేరి 1983 నాటికి పౌరహక్కుల సంఘం కార్యదర్శిగా ఎన్నికయ్యారు.పౌర హక్కుల ఉద్యమం స్వతంత్రంగా తన చుట్టూ ఉన్న అన్ని ఉద్యమాలలో నైతిక విలువల సార్వజనీనతను ముందుకు తీసుకుపోతూ వాటి వ్యవస్థీకరణ కోసం ప్రయత్నాలు, ప్రయోగాలు చేయాలి అని బాలగోపాల్ ప్రతిపాదించారు. 'సామాజిక మార్పులో నక్సలైట్ ఉద్యమాలతో పాటుగా ఇతర ఉద్యమాలు కూడా భాగం అయినప్పుడు పౌర హక్కుల సంఘం కేవలం నక్సలైట్ ఉద్యమాలతో మాత్రమే సరిపుచ్చుకోకుండా ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరుగుతున్న అన్ని రకాల ఉద్యమాల గురించి కూడా పట్టించుకోవాలి' అనే దానికి బాలగోపాల్ సైద్ధాంతిక రూపా న్ని తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఆ ప్రయత్నంలో భాగంగా 'పౌర హక్కుల సంఘంలో ఆ అంతర్గత ఆలోచనని మౌలికంగా మార్చలేం' అనే ఆలోచనతో ఆయన పౌర హక్కుల సంఘం నుండి నిష్క్రమించారు. పీడిత వర్గ ప్రజల సాధారణ పౌర హక్కులతో పాటు సామాజిక, ప్రజాస్వామిక హక్కులను కూడా బాలగోపాల్ గుర్తించి అందుకు అనుగుణంగా 1998, అక్టోబర్ 11 నాడు 'మానవ హక్కుల వేదిక' (హెచ్ఆర్ఎఫ్)ను స్థాపించారు.ఎస్. జీవన్ కుమార్, ఎ.సునీత, మధుసూదన్ రాజ్ తదితరులను కన్వీనర్ లుగా ప్రకటించారు. ఒక రకంగా అస్తిత్వ ఉద్యమాలు అందించిన హక్కుల అవగాహనను విస్తృతపరిచే దిశలో మానవ హక్కుల వేదిక ఏర్పడడం గమనార్హం. రాజ్యంతోపాటు రాజ్యేతర శక్తులు సృష్టించే హక్కుల ఉల్లంఘనలపై కూడా హక్కుల ఉద్యమం దృష్టిని కేంద్రీకరించాల్సిన అవసరాన్ని మానవ హక్కుల వేదిక గుర్తించింది. మానవ హక్కుల ఆచరణలో 'హిందూత్వ హింస'ను ప్రతిఘటించడాన్ని ఒక ప్రధాన అంశంగా బాలగోపాల్ ప్రతిపాదించి మానవ హక్కుల అజెండాగా విస్తరించారు. మానవ హక్కుల వేదికలో భాగంగా బాలగోపాల్ విశాఖపట్నం అభివృద్ధి ప్రాజెక్ట్ కింద స్థానభ్రంశం అయ్యే గిరిజనుల హక్కుల కోసం, భూమి కోసం ఉద్యమించారు. అలాగే ఖమ్మం, తూర్పు గోదావరి జిల్లాలో నిర్వాసితుల కోసం ఆయన కోర్టు ద్వారా పిటిషన్లు వేసి ఉద్యమించారు. 1/70 గిరిజన భూమి రక్షణ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనేతరుల నివాసాలకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేయడాన్ని బాలగోపాల్ తీవ్రంగా వ్యతిరేకించి ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టులో వేసి ఆ ప్రక్రియను అడ్డుకున్నాడు.రంపచోడవరం ఏజెన్సీలో 1400 ఎకరాల భూమికి సంబంధించిన గిరిజనేతరుల క్రయవిక్రయాలను కోర్టు ద్వారా ఆయన నిలువరించగలిగారు. గిరిజనేతరులకు అనుకూలంగా ఇస్తున్న భూమి రక్షణ ఉత్తర్వులు జారీ చేసే మండల రెవెన్యూ అధికారి అధికారాన్ని పోలవరం మండలం ఇటుకల కోట భూమి వివాద కేసులో ఆయన హైకోర్టులో సవాలు చేసి నిలువరింపజేశారు. అలాగే ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాలలో ఓపెన్ కాస్ట్‌లకు వ్యతిరేకంగా బాలగోపాల్ ఉద్యమించారు. నెల్లూరు జిల్లా తడ వద ?దస్థాపించిన తొలి సెజ్ కర్మాగారం అపాచీ కారణంగా బాధితులకు అండగా ఆయన ఉద్యమించారు. అలాగే విశాఖపట్నం జిల్లా సోంపేటలో థర్మల్ పవర్ ప్లాంట్ కి వ్యతిరేకంగా ఆయన ఉద్యమించారు.